క్లుప్తంగా

నేడు ఎస్.పెద్దవలసలో 'గడగ గడపకు'

మక్కువ: మండలంలోని ఎస్.పెద్దవలస పంచాయతీలో బుధవారం గడగ గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సిహెచ్.సూర్యనారాయణ మంగళవారం తెలిపారు. బుధ, గురువారాలు డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో ఎస్.పెద్దవలస పంచాయతీ పరిధిలో వీరాడవలస, ఎస్.పెద్దవలస, కొత్తకామునివలస, పాతకామునివలస, శీబిల్లి గ్రామాల్లో కార్యక్రమం జరుగునుందని తెలిపారు. అలాగే 8, 9 తేదీల్లో మార్కొండపుట్టి పంచాయతీలో గడగ గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరపనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



పట్టణంలో నిర్వహిస్తున్న ర్యాలీ

సాలూరు: పౌష్టికాహారంతో రక్తహీనత దూరమవుతుందని పట్టణ సీడీపీఓ సత్యవతి అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం గుమడాం నుండి పెదహరిజనపేట వరకు అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కిశోర బాలికల దశ నుండి గర్భిణులు, బాలింతలకు ఆకుకూరలు, పప్పు, పాలు, పండ్లు వంటి పోషక విలువలు కూడిన ఆహారం తీసుకోవడం వలన రక్తహీనత తగ్గి ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చని తెలిపారు. పోషకాలతో కూడిన ఆహారం వలన కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ మంగతాయారు, సూపర్‌వైజర్లు రవణమ్మ, భారతి, తిరుపతమ్మ, అంగన్‌వాడీలు రాధ తదితరులు పాల్గొన్నారు.

జీజీఎంపీ నిధులతో అభివృద్ధి పనులు



పెదభోగిలిలో మాట్లాడుతున్న పీఆర్ ఏఈ చంద్రమౌళి

సీతానగరం: మండలంలోని పెదభోగిలి పంచాయతీలో గడగడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) నిధులతో ఎస్సీకాలనీ రోడ్డు, యాదవ వీధి రోడ్డు పనులు చేపడతామని మండల ఇంజినీరింగ్ అధికారి చంద్రమౌళి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పెదభోగిలి యాదవ వీధిలో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ ప్రక్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల అవసరాలను తీర్చడానికి తమవంతు సహకారాన్ని అందిస్తామని చెప్పారు. మొదటి విడతగా రూ.20 లక్షలు విడుదల చేయడంతో గ్రామ పెద్దల సమక్షంలో సీసీరోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమం.. ప్రభుత్వ లక్ష్యం



కొత్తపింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కృష్ణ, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ

సీతానగరం: అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకం అందివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, సర్పంచ్ సిహెచ్ కృష్ణ అన్నారు. ఈ మేరకు మంగళవారం వారు ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన జగనన్న కానుక పింఛన్లను సచివాలయంలో ఎంపీటీసీ సింహాచలంతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఇంతవరకూ వివిధ రూపాల్లో 285 మందికి పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. ఇంకా అర్హులైన వారు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వితంతువులు, వృద్ధులు పింఛన్లు మంజూరుచేయాలని వినతిపత్రాలు ఇవ్వడంతో అదనంగా 22 పింఛన్లు మంజూరైనట్లు చెప్పారు. ఇప్పటికి 4 కొత్తపింఛన్లు పంపిణీ చేశామని త్వరలో మిగిలిన 18 పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. వెలుగు ద్వారా రాయితీపై రుణాలు, స్వయం ఉపాధి కోసం బ్యాంక్‌లనుంచి రుణాలు సమకూర్చినట్లు తెలిపారు. అలాగే గ్రామంలో సామాజికపరమైన సమస్యలు పరిష్కరించడానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి, వెల్ఫేర్ సహాయకులు పాల్గొన్నారు.

39 మంది సీఆర్‌టీలకు రెన్యువల్

సీతంపేట: స్థానిక ఐటీడీఏ పరిధిలో వివిధ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 39మంది సీఆర్‌టీలను రెన్యువల్ చేయాలని గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర అధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి. ఈ విద్యా సంవత్సరం ఆరంభంలో కొంతమంది సీఆర్‌టీలను వివిధ కారణాలతో నిలుపుదల చేశారు. ట్రైబల్ వెల్ఫేర్ ఉన్నతాధికారులకు ఈ విషయంపై నివేదిక పంపించారు.

ప్రతి గడపకూ సంక్షేమం

● డిప్యూటీ సీఎం రాజన్నదొర



నగుళ్ల దబ్బగెడ్డ గ్రామంలో పర్యటిస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

మక్కువ: ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందించాలన్న ధ్యేయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీ పరిధిలోని అనసభద్ర, నగుళ్ల దబ్బగెడ్డ ,మెట్టవలస , బోరింగ్‌వలస, మడవలస గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరకు గిరిజనులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సీఎం సందేశంతో కూడిన బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందించారు. అర్హులైనప్పటికీ ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి సత్వరమే పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించారు. గ్రామాల్లో సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేస్తే పరిష్కరిస్తామని డిప్యూటీ సీఎం రాజన్నదొర హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా ప్రతీ కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీడీపీ నాయకులు ఇళ్లల్లో కూర్చుని లేనిపోని ఆరోపణలు గుప్పిస్తున్నారని త్వరలో టీడీపీ నాయకులకు గట్టి సమాధానమిస్తామన్నారు. గ్రామాల్లో పర్యటించి పండుటాకులతో ముచ్చటించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఏవిధంగా ఉందో అడిగి తెలుసుకున్నారు. నగుళ్లదబ్బగెడ్డ గ్రామంలో పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సీదరపు లక్ష్మి, ఎంపీపీ మర్రిపారమ్మ, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఎంపీడీఓ సీహెచ్.సూర్యనారాయణ, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ, అధికారులు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంపై తప్పుడు ఆరోపణలు తగవు



ఎంపీపీ మర్రి పారమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రమీల

మక్కువ: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొరపై లేనిపోని తప్పుడు ఆరోపణలు చేయడం తగదని, లేనిపోని ఆరోపణలు చేస్తే క్రిమినల్ కేసులు పెడతామని ఎంపీపీ మర్రి పారమ్మ అన్నారు. ఎంపీపీ విలేకరులతో మంగళవారం మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధార నాయక్ తప్పుడు ఆరోపణలు చేయడం సరైనది కాదన్నారు. గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో ట్రైకార్ రుణాల్లో అవినీతి అడ్డాగా మార్చుకున్నారని తప్పుడు ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. ముందు ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేస్తే ఉపేక్షించేది లేదని, చట్టపరంగా పోరాడుతామన్నారు. తప్పుడు ఆరోపణలు చేసిన ధార నాయక్ డిప్యూటీ సీఎం రాజన్నదొరకు క్షమాపణ చెప్పాలని ఎంపీపీ డిమాండ్ చేశారు.

అసత్య ఆరోపణలు సరికాదు

పాచిపెంట: ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొరపై అసత్య ఆరోపణలు చేస్తే క్రిమినల్ కేసులు తప్పవని ఎంపీపీ బి.ప్రమీల అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గిరిజన ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో కలిసి ఆమె మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇటీవల తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారా నాయక్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొరపై చేసిన ఆరోపణలపై ఆమె తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ నాయకులు మతిభ్రమించి, ప్రజాక్షేత్రంలో ఎలాగో గెలవలేమని, ఏం చేయాలో అర్థం కాక చౌకబారు విమర్శలు చేస్తున్నారన్నారు. సాలూరు నియోజకవర్గంలో గిరిజన ప్రజలు రాజన్న దొరను ఆరాధ్య దైవంగా కొలుస్తారని అన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులకు దమ్ము, ధైర్యం ఉంటే రాజన్నదొర అవినీతి చేసినట్లు నిరూపిస్తే, రాజన్నదొరతో పాటు ఈ నియోజకవర్గంలో ఉన్న గిరిజన ప్రజాప్రతినిధులు అందరం రాజీనామా చేస్తామన్నారు. మంత్రిపైన చేసిన ఆరోపణలు నిరూపించాలని లేకుంటే పత్రిక ముఖంగా క్షమాపణలు చెప్పాలన్నారు. సర్పంచ్‌లు చెల్లూరి సీతారాం, కొర్ర బుచ్చిబాబు, చోడిపల్లి సుందరరావు, ఎంపీటీసీలు కాదల అన్నపూర్ణ, మదల సత్యవతి, తోకల లక్ష్మి, తడంగి సింహాచలం, తదితరులు ఉన్నారు.

ఒకే ఇంటి ఓటర్లు ఒకే పోలింగ్ బూత్‌లో..: పీఓ



సమావేశంలో మాట్లాడుతున్న పీఓ విష్ణుచరణ్

సాలూరు: ఒక ఇంటి ఓటర్లందరు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఐటీడీఏ పీఓ, సాలూరు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి విష్ణుచరణ్ అన్నారు. ఓటరు జాబితా విచారణలో భాగంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఒక పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1500 ఓట్లు మాత్రమే ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఒక ఇంటి ఓటర్లతో పాటు వీధిలో ఓటర్లు అవకాశం ఉన్నంత వరకు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జూలై 21 నుండి ఆగస్టు 21 వరకు ఇంటింటి ఓటరు విచారణ చేపట్టామని అన్నారు. ఓటరు విచారణలో భాగంగా ఫారం 6, 7, 8 తీసుకోవడం జరిగిందని అన్నారు.ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓట్ల తొలగింపు ఉంటుందని స్పష్టం చేశారు. మరణించిన వ్యక్తులు, శాశ్వతంగా వలసలు వెళ్లిన వారు, డూప్లికేట్ ఓటర్ల వివరాలు తొలగించడం జరుగుతుందని అన్నారు. ఈ క్రమంలో రాజకీయ పార్టీల నాయకుల సందేహాలను నివృత్తి చేస్తూ, వారి సూచనలను తెలుసుకుని చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాల మురళీకృష్ణ, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మచ్చలేని నాయకుడు రాజన్నదొర



విలేకర్లతో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సాలూరు: మచ్చ లేని నాయకుడు ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అని ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మరిపల్లిలో స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. రాజొన్నదొరపై తెలుగుదేశం ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకుడు దారా నాయక్ చేసిన తప్పుడు ఆరోపణలను ఖండిస్తున్నామని చెప్పారు. ఆరోపణలు చేసిన రెండు రోజుల్లోగా నిరూపించాలని, లేకుంటే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. వారి వెంట గిరిజన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ముివ్వల ఆదయ్య, పీడిక సుదర్శనదొర, జన్ని సీతారాం, పాస్టర్ సువార్తరావు, బీసు, కె.ఉదయ్‌కుమార్, సాంబమూర్తి ఉన్నారు.

యుద్ధ ప్రాతిపదికన రోడ్డుపనులు



సీతానగరం మార్కెట్‌లో జరుగుతున్న రోడ్డు పనులు

సీతానగరం: మండలకేంద్రంలోని మార్కెట్ రోడ్డుపై ఏర్పడిన గోతులను పూడ్చాలని కోరుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సోమవారం కలెక్టర్‌కు దరఖాస్తు అందజేసిన 24 గంటలకే రోడ్డు మరమ్మతులను అధికారులు ప్రారంభించారు. వర్షాలు విస్తారంగా కురవడం వల్ల, నిరంతరం వాహనాలు తిరుగాడడం, కాలువలులేక పోవడంతో మార్కెట్‌లో నీరునిల్వ ఉండిపోయి రోడ్డుపై గోతులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో స్థానికుల విజ్ఞప్తి మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగారావు కలెక్టర్‌కు అర్జీ అందజేశారు.

ఘనంగా గురుపూజోత్సవం



బలిజిపేట: సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్ రామారావు



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న నోబుల్ వాకర్స్‌క్లబ్ ప్రెసిడెంట్ యిండుపూరు గున్నేష్, డీఈఓ ఎస్. ప్రేమ్‌కుమార్

బలిజిపేట: ఉపాధ్యాయ దినోత్సవాన్ని మండలంలోని పాఠశాలల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులకు అభినందనలు తెలుపుతూ బహుమతులు అందించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా వెంగళరాయపురం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు విజయ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన గొప్పతనాన్ని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, వేణు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

పార్వతీపురంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజుగా ప్రదర్శించిన వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ రామారావు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

నోబుల్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో టీచర్స్‌డే

పార్వతీపురం టౌన్: పట్టణంలోని జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో నోబుల్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో టీచర్స్‌డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 17 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేష్ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల బాధ్యత సమర్థవంతమైనదని, ఎందరో విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నారని, మంచి సమాజాన్ని ఉపాధ్యాయులు నిర్మించాలని అందుకు ప్రభుత్వ సహాయ సహకారాలు అందిస్తుందని దాన్ని వినియోగించుకుని ఉన్నతమైన విద్యను అందించాలని కోరారు. కార్యక్రమంలో డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్, నోబుల్ వాకర్స్ గవర్నర్ ఎంఈఓ నారాయణస్వామి, బి.వెకంటనాయుడు, ఆర్ ఎస్‌నాయుడు డి.వెంకట రమణ, వెంకటేశ్వరరావు మాస్టారు పాల్గొన్నారు.

ఘనంగా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు



సాలూరు: తోణాంలో జెడ్పీ చైర్మన్ జన్మదినోత్సవ వేడుకలు



పాచిపెంట: జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఆయన అభిమానులు, పార్టీ శ్రేణులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. రక్తదాన శిబిరాల్లో అభిమానులు రక్తదానం చేశారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్

మదర్ థెరిసా సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలి



మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సేవాసంఘం కన్వీనర్ వెంకటరమణ

సీతానగరం: మదర్ థెరిసా ఆశయ సాధనను ఆమె నిర్వహించిన సామాజిక సేవలను యువతీ యువకులు స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాలు చేపట్టడానికి ముందుకు రావాలని మండలంలోని బుడ్డిపేట మదర్ థెరిసా యువజన సేవాసంఘం కన్వీనర్ ఎం.వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మదర్ థెరిసా వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఆమె విగ్రహానికి పూలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో అన్ని ప్రాంతాల్లో సేవాకార్యక్రమాలను చేపట్టిన కారణంగాకేంద్ర ప్రభుత్వం నుంచి నోబుల్ బహుమతి అందుకున్న ఘనత మదర్ థెరిసాకు దక్కిందన్నారు. యువతీ యువకులంతా సేవాకార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందాలని కోరారు. కార్యక్రమంలో సీతానగరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శంకరాపు సింహాచలం, సేవాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



వార్డుల్లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన నా అడుగు మీకోసం అనే కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, పురపాలక సంఘం అధికారులతో కలిసి పట్టణ పరిధిలోని మూడవ వార్డు వివేకానంద కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలను కలుసుకుని వార్డులో మంచినీరు బాగా వస్తుందా? కాలువలు శుభ్రంగా ఉన్నాయా? ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ సకాలంలో అందుతున్నాయా? ఇవి కాకుండా ఇంకా వార్డులో ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకుని వార్డులో అపరిశుభ్రంగా ఉన్నచోట శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక కౌన్సిలర్లు సువ్వాడ లావణ్య, కోరాడ శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాదవరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పౌష్టికాహారంతో అందరికీ ఆరోగ్యం



గుచ్చిమి అంగన్వాడీ కేంద్రం వద్ద ర్యాలీలో మాట్లాడుతున్న సీడీపీఓ సుగుణ

సీతానగరం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం ప్రీస్కూల్ పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య ప్రదాయిని అన్ని బొబ్బిలి రూరల్ ఐసీడీఎస్ పీఓ సుగుణ అన్నారు. ఈ మేరకు మంగళవారం గుచ్చిమి, జోగింపేట అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న 4 సెంటర్ల ప్రీస్కూల్ పిల్లలు, బాలింతలతో గుచ్చిమి సెక్టార్ సూపర్‌వైజర్ పూర్ణిమ ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా గుచ్చిమిలో ఆమె మాట్లాడుతూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది ద్వారా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పౌష్టికాహారం భుజించడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు. మండలంలో నిర్వహించే వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాలల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ఘనంగా సన్మానం



హెచ్‌సీ కృష్ణమూర్తిని సత్కరిస్తున్న యాదవ సంఘం సభ్యులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.కృష్ణమూర్తి సేవలు మరువలేనివని పార్వతీపురం యాదవ సంఘం నాయకులు కొనియాడారు. ఈ మేరకు మంగళవారం గురుపూజోత్సవం సందర్భంగా పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కృష్ణమూర్తికి పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణమూర్తి లాంటి సేవాతత్పరులు మన పార్వతీపురంలో ఉండడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. కృష్ణమూర్తి ప్రతినెల తన వేతనంలో కొంత మొత్తాన్ని పేద ప్రజల కోసం కేటాయించడం సంతోషదాయకమన్నారు. అనాథలకు ఆప్తుడుగా, పేదలకు అండగా ఆయన నిలబడడం గొప్ప విషయమన్నారు. కృష్ణమూర్తిని ఆదర్శంగా తీసుకుని పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు బత్తుల రమేష్, నాయకులు బత్తుల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ఆర్మీ దుర్గాప్రసాద్, రామారావు, ఈశ్వరరావు, గోవిందరావు, 30వ వార్డు కౌన్సిలర్ రణభేరి చిన్నంనాయుడు, పి.పోలినాయుడు, పులిబాబు, వి.గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన పెంపొందించుకోవాలి



నర్సిపురంలో రాష్ట్రీయ పోషణ మాహ్ కార్యక్రమంలో పాల్గొన్న మహిళాశిశు సంక్షేమశాఖ అధికారి కె. విజయగౌరి

పార్వతీపురంటౌన్: రాష్ట్రీయ పోషణ మాహ్ సెప్టెంబర్ 30వరకు నిర్వహించనున్నామని పార్వతీపురం మన్యం జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి కె. విజయగౌరి తెలిపారు. రాష్ట్రీయ పోషణ మాహ్ కార్యక్రమాన్ని నర్సిపురం అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, శిశువులు, బాలలు, కిశోరీ బాలికలపై ప్రత్యేక దృష్టిసారిస్తూ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు. సుపోసిత్ భారత్, సాక్షరభారత్, సశక్త్‌భారత్ శీర్షికన రాష్ట్రీయ పోషణ మాహ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిశువుల తల్లిపాలు, అదనపు ఆహారం అందించడం, పౌష్టికాహారం పెంపొందించడం, రక్తహీనత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. పౌష్టికాహారం తయారీ విధానం, చిరుధాన్యాల వినియోగం, ఉపయోగాలు తెలియజేస్తామన్నారు. రక్తహీనత పరిస్థితులను తెలుసుకునేందుకు చిన్నారులు, గర్భిణులకు పునరోత్పత్తి దశలో ఉన్న మహిళ వివరాలు తెలుసుకోవడానికి మురికివాడలు, ఇతర ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పార్వతీపురం / సాలూరు
9010204441, 9951602891
Office mail : vzmadvt@gmail.com